క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎటపాక: మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు మంగళవారం నల్లకుంట గ్రామంలో ఉత్సాహంగా జరిగాయి. నల్లకుంట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సీతారాములు పోటీలు ప్రారంభించారు. అనంతరం అండర్ 14,17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్,ఖోఖో, కబడ్డీ,అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రంపచోడవరంలో జరిగే డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని హెచ్‌ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు కన్నారావు, రాజేష్, లక్ష్మణరావు, ప్రసాద్, రాందాస్, కృష్ణవేణి, అనిల్, భువనేశ్వరి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు పనులు ప్రారంభం



డిగ్రీ కళాశాలలో బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు ఎంపీపీ కోరాబు అనూషదేవి తెలిపారు. కళాశాలలో మండల పరిషత్ నిధులు రూ.2లక్షలతో చేపట్టిన బోరు ఏర్పాటు పనులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంత కాలంగా డిగ్రీ కళాశాల బాలికల వసతి గృహంలో మంచినీటి సమస్య వేధిస్తోందని,ఈ సమస్యను తన దృష్టి రావడంతో మండల పరిషత్ నిధులు కేటాయించినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాగలక్ష్మి,కో ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి,వార్డెన్ వినాయకరావు,లైబ్రేరియన్ జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మిషన్ తాజంగి సభ్యులు

చింతపల్లి: తాజంగి కొండపై ఉన్న దొంతులమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో గల పిచ్చి మొక్కలను మిషన్‌తాజంగి సభ్యులు శ్రమదానంతో తొలగించారు. తాజంగిమిషన్ పేరిట కొంత మంది యువకులు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా పిచ్చి మొక్కలను తొలగించి, రాకపోకలకు వీలుగా రహదారిని తయారు చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ సభ్యులతో పాటు ఆలయ పూజారి గణపతి, నీటిసంఘం ఉపాధ్యక్షుడు విశ్వనాథం,రామాలయ సేవా సంఘం అధ్యక్షుడు పెనుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనకు కృషి చేయాలి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఏపీసీ స్వామినాయుడు

చింతపల్లి: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు బోధనాభ్యాసన స్థాయిలను పెంచుకోవాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ స్వామినాయుడు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ గణితం, తెలుగు పాఠ్యాంశాల్లో బోధించాల్సిన పద్ధతులపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 1,2 ప్రసాద్, బోడంనాయుడు, రిసోర్సు పర్సన్లు వెంకటరమణ, మునిస్వామి, సంజీవరావు, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: దామనాపల్లి పంచాయతీ మాడెం కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను సర్పంచ్ కె.రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కోరారు.

పరాయి పంచన ఎన్నాళ్లు ?



వెలుగు కార్యాలయంపైన అసంపూర్తిగా ఉన్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ భవనం



భవనం పైకప్పు నుంచి చిమ్ముతున్న వర్షపునీరు

- కారిపోతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- రికార్డులు భద్రపరిచేందుకు అవస్థలు

ముంచంగిపుట్టు: స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం ఏళ్ల తరబడి పరాయి పంచన కొనసాగుతోంది. గతంలో మండల పరిషత్ క్వార్టర్స్‌లో ఈ కార్యాలయాన్ని నిర్వహించారు. అది శిథిలమవడంతో స్థానిక కల్యాణ మండపంలోని ఓ గదిలోకి మార్చారు. తొమ్మిదేళ్లుగా ఆ గదిలోనే ఈ కార్యాలయం కొనసాగుతోంది. 17 ఏళ్ల కిందట సొంతభవనం నిర్మాణం ప్రారంభించగా ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో ఉపాధి సిబ్బంది తీవ్ర అవస్థలకు గురవుతూ విధులు నిర్వహిస్తున్నారు.

అసంపూర్తిగా భవనం

స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం కోసం చేపట్టిన నూతన భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. 2008 సంవత్సరంలో వెలుగు,ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాలు ఒకేచోట ఉండేవిధంగా రూ. 20లక్షలతో భవనాలు మంజూరు చేశారు. వెలుగు కార్యాలయం పూర్తయి, ఉద్యోగులు అందులో విధులు నిర్వహిస్తున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయ భవనం మాత్రం పూర్తి కాలేదు.80శాతం వరకు పనులు జరిగినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు.గతంలో పలుమార్లు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా తమ అవస్థలను ఉన్నతాధికారులు గుర్తించి, అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

చిన్న వర్షానికే ...

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ భవనం కారిపోతోంది. భవనం పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతూ ఉండడంతో కొన్ని సార్లు గొడుగులు పట్టుకుని సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. కొన్నిసార్లు నీరు గదిలో నిల్వ ఉండిపోతుండడంతో దానిని బయటకు తోడేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో ఉన్న ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు,ఆడిట్ పుస్తకాలు తడిసిపోతున్నాయి. ఉన్నది ఒకే ఒక గది కావడం, అక్కడే కంప్యూటర్లు,బీరువాలు, ఇతర సామగ్రి, ఫర్నీచర్ ఉండడంతో ఇరుకుఇరుకుగా విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని. ఇక్కడ ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వివిధ పనులపై సుమారు 40 మంది ఏఆర్‌పీలు, టీఏల్స్ నిత్యం ఇక్కడి వస్తుంటారు. ముఖ్యంగా సమావేశాలు జరిగేటప్పుడు కొంత మంది కూర్చుంటే మరికొంత మంది నిల్చునే ఉండాల్సి వస్తోంది.



కారిపోతున్న భవనంలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

ప్రతిపాదనలు పంపాం

ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం కారిపోతున్న విషయాన్ని ఇప్పటికే సిబ్బంది నా దృష్టికి తీసుకువచ్చారు.గతంలో నిర్మించిన భవనం అసంపూర్తిగా ఉండడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే భవన నిర్మాణం పూర్తి చేస్తాం.

–ధర్మారావు, ఎంపీడీవో,ముంచంగిపుట్టు

బాల్య వివాహాలు అరికట్టాలి



పెదబయలు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల శిక్షణలో పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు: బాల్య వివాహాలను అరికట్టాడానికి అందరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి కె. రాజశేఖర్ అన్నారు. పెదబయలు పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల నెల వారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల లోపు ఆడ పిల్లలు వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎస్.శాంతి, ఎంపీహెచ్‌ఏ ఎస్. మూర్తి, సిబ్బంది సింహాచలం, కృష్ణకుమారి, బింగురాజు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పూర్తి చేయాలి

గంగవరం : స్థానిక పాత బ్యాంక్ వీధిలో అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని పీసా ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, ఆదివాసీ జేఏసీ సభ్యుడు కుంజం సిద్ధు అధికారులను కోరారు. ఉప కేంద్రం భవనాన్ని వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

మృతురాలి బంధువులకు ఎమ్మెల్యే పరామర్శ



కేజీహెచ్ మార్చురీ వద్ద మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న చెట్టి పాల్గుణ

పెదబయలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ మృతి చెందిన మండలంలోని కిముడుపల్లి పంచాయతీ మాటుగరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మర్రి భవాని(22) బంధువులను అరకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు చెట్టి పాల్గుణ పరామర్శించారు. మంగళవారం ఆయన కేజీహెచ్‌కు వెళ్లి సూపరింటెండెంట్‌తో మాట్లాడి, అంబులెన్స్‌లో మాటుగరువు గ్రామం వరకు మృతదేహాన్ని తరలించారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ పార్టీ కోసం భవానీ కష్టపడి పనిచేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ ఆశయ సాధనకు కృషి



కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కూనవరం: ఆదివాసీ పోరాట యోధుడు, నిజాం నవాబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కొమరం భీమ్ ఆశయ సాధనకు ఆదివాసీ యువత కృషి చేయాలని జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు తెలిపారు. 85వ వర్ధంతి సందర్భంగా కోతులగుట్టలో మంగళవారం కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సోడె ముత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ యువత హక్కుల కోసం పోరాడకపోతే మహనీయుల త్యాగాలకు విలువ ఉండదన్నారు. ఈకార్యక్రమంలో మడల చంటి, చిచ్చడి బాబురావు, చిచ్చడి అప్పారావు, చిచ్చడి చందర్‌రావు, సీత, రాధ, సోడె అర్జున్ కట్టం రమేష్, బేతి ముత్తయ్య, కరక అర్జున్, కుడియం కామరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఆదికర్మయోగి ర్యాలీలు



గింజర్తిలో ఆదికర్మ యోగి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండలంలోని గింజర్తి, తంటికొండ గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి నేతృత్వంలో ఆదికర్మయోగి అభియాన్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించినట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఆయన చెప్పారు. ఎంఈవో సూరయ్యరెడ్డి, వార్డు సభ్యులు కృష్ణవేణి, సత్తిబాబు, పీసా కమిటీ సభ్యులు సూర్యారెడ్డి, వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొంగర సావిత్రి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ

ముంచంగిపుట్టు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని ముంచంగిపుట్టు ఫారెస్టు రేంజర్ ఎం.మురళీకృష్ణ అన్నారు. జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో మంగళవారం వన్యప్రాణి వారోత్సవాలను ఫారెస్టు అధికారులు నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ–ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వన్యప్రాణులకు ఎటువంటి హాని చేయకూడదని, వన్యప్రాణుల మనుగడ వల్ల మానవులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అడవులను నాశనం చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని చెప్పారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్, ఫారెస్టు అధికారులు వెంకటరాజు, శ్రీను, రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన సచివాలయ ఉద్యోగుల కమిటీ

ముంచంగిపుట్టు: స్థానిక కల్యాణ మండపంలో మంగళవారం మండల సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయుడు పద్మారావు, ప్రధాన కార్యదర్శిగా చెండా గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కృష్ణారావు, లావణ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా భార్గవి శైలజ, మన్‌మోహన్, సుజాత, కోశాధికారిగా రవిరాజ్, మహిళా అధ్యక్షురాలిగా జోష్నలతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్ష,కార్యదర్శులు పద్మారావు, గంగాధర్‌లు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో 18గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న కౌన్సెలర్ వాసు

అడ్డతీగల: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం కౌన్సెలర్ నారే వాసు అన్నారు.మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ప్రజలకు అవగాహన కల్పించారు.మారుమూల గ్రామాల్లో నివాసం ఉండి వైద్యం అందని వారికి దగ్గరలో ఉన్న ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మత్తు మందుల కలిగే అనర్థాలు, అనారోగ్య సమస్యలను వివరించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామ సభలు



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో ధర్మారావు

ముంచంగిపుట్టు : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ధర్మారావు తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయ కార్యాలయ ఆవరణంలో మంగళవారం విశ్వకర్మ యోగి గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.29 అంశాలపై సభలో చర్చించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని దశలవారీగా పరిష్కరించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యానారాయణ,సర్పంచ్ సుభాష్‌చంద్ర, ఏపీవో వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి సింహాచలం, వీఆర్‌వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ జెడ్పీ సమావేశంలో కోరిన జెడ్పీటీసీ వెంకటలక్ష్మి



కాకినాడ జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి

రంపచోడవరం : మండలంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జరిగిన కాకినాడ జెడ్పీ సమావేశంలో రంపచోడవరం జెడ్పీటీసీ పండ వెంకటలక్ష్మి కోరారు. స్థానిక గురుకుల పాఠశాల బాలికల హాస్టల్లో మెనూ ప్రకారం విద్యార్థినులకు టిఫిన్, భోజనం, స్నాక్స్ ఇవ్వడం లేదని సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయని విషయాన్ని సభ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆమె చెప్పారు. ఐటీడీఏలో ఇప్పటి వరకు పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాలని కోరినట్టు ఆమె తెలిపారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

బుచ్చెయ్యపేట : మండలంలోని ఆర్.భీమవరంలో మంగళవారం భారీవర్షం కురిసింది. ఈ సమయంలో పిడుగుపడి రొంగలి చిన్నంనాయుడుకు చెందిన పాడి ఆవు మృతి చెందింది. పిడుగు పడిన సమయంలో ఆ శబ్దానికి చిన్నంనాయుడు అక్కడ నుంచి దూరంగా వెళ్లిపోవడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది.

వాల్మీకి మహర్షికి ఘన నివాళి



గంగవరంలో వాల్మీకి నివాళులర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు



చింతపల్లిలో వాల్మీకి మహర్షి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఏవో మధుసూదన్‌రావు

గంగవరం: పలు గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు వి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ, ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వర్లు, పీసా కార్యదర్శి పిల్లా చిన్నిబాబు, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ, కొమ్మన చిన్నారావు, సత్యవేణి తదితరులు పాల్గొని వాల్మీకి మహర్షికి నివాళులర్పించారు.

ఏటిపల్లిలో విగ్రహం ఆవిష్కరణ

ఏటిపల్లిలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షుడు గొర్లె చిన్న నారాయణరావు ఆవిష్కరించారు. వై.నిరంజనీ దేవి, స్వప్న కుమారి, వెంకటరెడ్డి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

చింతపల్లి: మండల కేంద్రం చింతపల్లిలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి టి. మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాళ్లు భరత్ కుమార్ నాయక్, చలపతిరావు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా కళాశాలలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భారీవర్షంతో పొంగిన వాగులు



భారీ వర్షానికి పొంగి ప్రవహిస్తున్న వట్టిగెడ్డ

రాజవొమ్మంగి: మండలంలో మంగళవారం ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజవొమ్మంగి శివారు వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు వరద నీరు వచ్చి చేరడంతో వట్టిగెడ్డతో పాటు పొర్లు వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో పనులకు వెళ్లిన వారు పొర్లు వాగు దాటేందుకు గంటకు పైగా ఒడ్డున వేచి ఉండవలసి వచ్చింది. రాజవొమ్మంగి శివారు కొండవాగు పొంగి ప్రవహిస్తోంది. వయ్యేడు, ముర్లవానిపాలెం, బూరుగుపల్లి తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు కాసేపు అంతరాయం కలిగింది.

హుకుంపేట: మండలంలోని తడిగిరి, తీగలవలస, శోభకోట, మట్టుజోరు, మఠం తదితర పంచాయతీల్లో మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద శబ్దాలతో పిడుగులు పడడంతో పలు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

జీఎస్టీపై వ్యాసరచన పోటీలు



అడ్డతీగలలో జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాలమురళీకృష్ణ

అడ్డతీగల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం డ్రాయింగ్, జీఎస్టీపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో–1 కె.రమేష్, ఎంఈవో–2 పి.శ్రీనివాసరావు, జీఎస్టీ ఆఫీసర్ ఎం.ఎన్.మూర్తి పర్యవేక్షించారు. అనంతరం జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.హెచ్‌ఎం జి.వెంకటలక్ష్మి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొయ్యూరు: రావణాపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం ఎంపీడీవో బాలమురళీకృష్ణ జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మృదుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్ : జీఎస్టీ 2.0పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ అవగాహన కల్పించారు. కొన్ని వస్తువుల శ్లాబ్ రేట్లు తగ్గించడం వల్ల వినియోగదారులకు సరైన ధరకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనిత కుమారి, నాగబాబు పాల్గొన్నారు.

చెరువు గట్టుపై ఆక్రమణల తొలగింపు

గూడెంకొత్తవీధి: పెదవలస చెరువు గట్టును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించినట్టు తహసీల్దార్ అన్నాజీరావు మంగళవారం తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగించినట్టు ఆయన చెప్పారు. చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు